


కథ

పాలెపు బుచ్చిరాజు

# అద్దెకొంప

నర్సీపట్నం హైస్కూల్లో లెక్కల మాస్టర్లు ఎందరో పనిచేసి ఉండొచ్చు. కానీ ఆ ఊళ్లో లెక్కల మాస్టారంటే సత్యం మాస్టారే. ఆయన ఉద్యోగం ప్రారంభించిందీ అక్కడి నుంచే, విర మించిందీ అక్కడే. స్థిరోభవ వరదోభవ అని అక్కడే ఉండిపోయారు. ఊళ్లో పంచాయతీ ప్రెసిడెంటు దగ్గర్నుంచి బళ్లో బంట్రోతు వరకూ ఆయన మొట్టికాయలు తిని పెరిగిన వారే.

ఏమయితేనేం బడిపంతులు బడిపంతులే. ఆ జీతం బెత్తెడే. అందులో మిగుల్చుకుని ఇల్లు కట్టడం అన్నది కలలోని మాట. అందుకే చాలా కాలం పాటు, సొంత ఇంట్లో ఉండాలన్న ఆయన శ్రీమతి కోరిక తీరింది కాదు. ఆమె మాత్రం పట్టువదలక, పంతులుగారి చెవి నిల్లు కట్టుకుని పోరుతూనే ఉంది. "ఏమండీ! మనం ఒక ఇల్లు కట్టుకుందామండీ! పిల్లలు ఎదిగొచ్చారు. ఎంతకాలమని ఈ అద్దెకొంపల్లో, ఇంటి యజమానుల దెప్పిపొడుపు మాటలు భరిస్తూ పడి ఉంటాం." అని. ఆ పోరుపడలేక, పల్లెటూళ్లో, తాతల కాలం నాటి మాగాణి, అన్నదమ్ములు పంచుకోగా తన వాటాకి వచ్చిన రెండెకరాలూ అమ్మేసి, ఆ డబ్బుతో, నర్సీప ట్నంలో ఓ చిన్న స్థలం కొని, ఇల్లు కట్టారు మాస్టారు. భార్య సలహా మీద, ముందుచూపుగా, పనిలో పనిగా, మేడ మీద కూడా మూడు గదులు, వంటిల్లు వేయించారు. ఆదాయానికి మరో ఆధారం ఎలాగూ లేదు కాబట్టి, కనీసం పై వాటా అద్దెకిస్తే, నాలుగురాళ్లు వస్తాయి కదా అని. ఇల్లాలి కోరిక తీరింది. ఉన్న స్థలంలోనే ఇంటి చుట్టూ, పూదోట, కరివేపాకు మొక్క, నిమ్మ మొక్క, జామి చెట్టు లాంటివి వేసి,వాటినీ పిల్లలతో సమానంగా పెంచుకుంటూ మురిసిపోసాగిందా ఇల్లాలు.

ఒకనాడు ఉదయాన్నే లెక్కల మాస్టారు ఇంటి వరం డాలో కూర్చుని వార్తాపత్రిక చదువుకుంటూండగా ఇంటి ముందొక జీపాగింది. "మనింటికి జీపులో వచ్చే వారెవరులే" అని మాస్టారంతగా పట్టించుకోలేదు ముందుగా. కానీ ఆ జీపులోంచి దిగినాయన తిన్నగా తన ఇంటికే వస్తూండడం గమనించి, గాభరాపడుతూ లేచి నిలబడ్డారు.

ఆ వచ్చినాయన "లెక్కల మాస్టారిల్లు ఇదేనాండి?" అని అడిగాడు.

"అవును బాబూ! నేనే లెక్కల మాస్టార్ని. మీరెవరు?" అడిగారు పంతులుగారు.

లేని నవ్వు మొహం మీద పులుముకుంటూ "నేనీ ఊరికి కొత్తగా వచ్చిన తాసీల్దారునండీ. మీ ఇంటిపై వాటా అద్దెకిస్తారని తెలిసి ఇలా వచ్చాను" అన్నాడా అగంతకుడు.

చెప్పొద్దూ. లెక్కల మాస్టారు, డి.ఇ.వో. మెరిట్ సర్టిఫికేట్ ఇచ్చినంత సంబరపడ్డారు. తన రొట్టెవిరిగి నేతిలో పడిందని పొంగిపోయారు. తాసీల్దారు వంటి పెద్ద ఆఫీసరు, తన ఇంట్లో అద్దెకుండడం అంటే మాటలా. అంతకంటే ఏం కావాలి?

"అలాగా? రండి! రండి! కూర్చోండి" అంటూ ఆయన్ని ఆహ్వానించి, కుర్చీ చూపించారు. తను సవిన యంగా చేతులు కట్టుకు నిలబడ్డారు.

తాసీల్దారు ఏమీ మొహమాట పడకుండా హుందాగా కుర్చీలో కూలబడి, "అద్దె ఎంత చెపుతున్నారు?" అని అడిగాడు.

"అద్దెదేముంది లెండి. మీకిల్లు నచ్చితే అదేమంత పెద్ద విషయం కాదు" అంటూ ఇల్లు చూపించడానికి మేడమీదికి దారి తీశారు మాస్టారు.

ఇల్లు ఒక్కొక్క గదీ చూపిస్తూనే, కొత్తగా వచ్చినాయన పుట్టుపూర్వోత్తరాలూ, ఇదివరలో ఎక్కడున్నదీ, చుట్టపక్కాలూ, అన్నీ ఆరా తీశారు. పోయి పోయి, ఆయనకి, వారి దూరపు బంధువులకీ బీరకాయ పీచు సంబంధం ఉన్నట్టు కూడా తేలింది.

తాసీల్దారు తిరిగి వెళ్తూ "అద్దె ఎంతో చెప్పారు గాదు" అని మరోసారి అడిగాడు. అంత పెద్ద ఉద్యోగస్తుదు తరచి, తరచి అడుగుతూంటే, పంతులుగారు మెలికలు తిరిగిపోయారు గానీ నోటంట మాట రాలేదు.

"సరే! మీరు మొహమాట పడుతున్నారు గనుక నేనే చెప్తుతున్నాను. నెలకి రెండు వందలిస్తాను. కాదన కండి. కరెంటు ఖర్చు కూడా అందులోనే" అంటూ అదేదో ధర్మానికిస్తున్నట్టు చెప్పి, "రేపే కుటుంబంతో దిగుతాను. కాస్త కడిగించి, శుభ్రం చేసి పెట్టండి" అని ఆర్డరు జారీ చేసి, జీపెక్కి వెళ్లిపోయాడు.

మాస్టారు నివ్వెరపోయి అటే చూస్తూ ఉండిపోయారు.


"నిక్షేపంలాంటి ఇల్లు. ఎవరికిచ్చినా నాలుగయిదు వందలు కళ్లకద్దుకుని ఇచ్చేవారు. మీరెందుకలా జావ గారిపోయారు?" అని చీవాట్లు పెట్టింది భార్య. ఏమన గలరాయన?

"పోనీలేవే, మనవాడు, ఏ అవసరానికైనా పనికివస్తాడు" అని సర్దిచెప్పారు భర్త. ఆడకూతురు. ఎదుటపడి మాట్లాడగలదా ఏమయినానా? కానీ ఆమెకిదేమీ నచ్చలేదు. అగ్గిపెట్టెల్లాంటి రెండు గదులకి మూడొందలు ముక్కు పిండి పుచ్చుకునేవాడు పూర్వపు ఇంటి యజమాని. తను మరిచిపోగలదా?

ఏ ముహూర్తాన ఆ తాసిల్దారు ఆ ఇంటిలో అడుగు పెట్టాడో, ఆ నాటి నుంచీ, లెక్కలమాస్టారింట్లో సుఖ శాంతులు సుదూర ప్రాంతానికి వలస వెళ్లిపోయాయి. మేడమీద, కనిపించిన దగ్గరల్లా కేలండర్లు, ఫోటోలు తగిలించడానికి అంతలేసి మేకులు దిగ్గొట్టసాగారు వాళ్లు. ఒక్కొక్క మేకూ కింద ఇంటి యజమానుల గుండెల్లో తుపాకీ తూటాల్లా దిగాయి. ఎంతో అప్యాయంగా ఒక్కొక్క ఇటికా పెట్టి కట్టించుకున్నారు వారా ఇల్లు. వాళ్లలా దయాదాక్షిణ్యాలు లేకుండా నాశనం చేస్తుంటే, అదేమని అడిగే ధైర్యం ఏదీ? ఆయనేమో తాలూకాకే పెద్ద రెవెన్యూ అధికారి. అతని పై అధికారి అతని భార్య. ఆవిడ గయ్యాళితనం వచ్చిన వారం రోజుల్లోనే అర్థమైంది. బంట్రోతుల్ని హడలగొట్టి, నీళ్లకని, పాలకని పరుగులెత్తిస్తుందామె.

ఇహ పిల్లల విషయం అడక్కండి. ప్రతి నిత్యం కింద ఇంట్లోనే ఆటలాడడం. వాళ్లకి పెందరాళే రెండు మెతుకులు పడేసి కిందకి తోలేస్తుందా ఇల్లాలు. సాయంత్రం దాకా, పూలమొక్కలు తొక్కేస్తూ కిటికీ అద్దాలు పగుల గొడుతూ అక్కడే వాళ్ల మకాం. పోనీ పిల్లలు వాళ్లనొదిలేద్దాం. ఈ బంట్రోతులకేమొచ్చిందని? అమ్మగారు

ఉప్మాలోకి తెమ్మన్నారని, కరివేపాకు చెట్టు, నిమ్మచెట్టు వదిలి పెట్టరు వాళ్లు. ఆమెకిచ్చేవి నాలుగు రెబ్బలూ, అరడజను నిమ్మకాయలూ అయితే, వీళ్ల ఇళ్లకి మోసుకుపోయేవి లెక్కకు మిక్కిలి. ఇంక ఇంటివాళ్లు కోసుకోడానికేం మిగిలేను? ఓసారి మాస్టారుగారి ఇల్లాలికి గోరుచుట్టయితే, పై అవిడే దయ తలిచి, ఓ నిమ్మకాయ కోసి పెట్టుకోండని ఇచ్చింది. రాను రాను పరిస్థితి ఎలా తయారైందంటే, తాసిల్దారుగారింట్లో, లెక్కలమాస్టారు అద్దెకుంటున్నారేమో అనిపించేది.



ఇంత జరుగుతున్నా అదేమిటని అడిగే ధైర్యం ఎవరికి? బడిపంతుళ్ళు, సాధుజంతువులైన ఆవులు, బెదురుగొడ్డులైన జింకలు వగైరా జాతికి చెందిన వారు. వారి పెంపకంలో పిల్లలూ అంతంత మాత్రమే. 'చదువుకుంటున్నాం. అల్లరి చేయకం'డని అదలించే ధైర్యం లేని వారు వారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడూను పంతులుగారికి.


మేకవన్నె పులుల్ని చూశాం కానీ, మోకాల్ని పోలిన మేకల్ని చూశామా ఎక్కడైనా? పంతులుగారి పనీ అలాగే తయారైంది. ఒక నెలాఖర్న, అద్దె అడుగుదామని మేడపైకి వెళ్లారు మాస్టారు. అద్దె విషయం ఎత్తితేనే, ఆయన వారి మీద విరుచుకుపడ్డాడు. "ఏమైపోతాయి ముష్టి రెండొందల రూపాయలు? అద్దె ఎగ్గొట్టి దానితో మేడలు, మిద్దెలు కడతామనుకున్నావా? ముష్టి మనుషులూ, ముష్టి గుణాలునూ. అప్పుడంటే వచ్చావు గానీ, ఇంకెప్పుడు నీ పాడుముఖంతో నా గుమ్మం తొక్కకు. అద్దె ఇప్పుడప్పుడే ఇచ్చేది లేదు. నీ దిక్కున్న చోట చెప్పుకో ఫో!" అని తరిమికొట్టాడు. పాపం పంతులుగారు ముఖం చింతాకంత చేసుకుని, కిక్కురుమనకుండా, కిందికి దిగి వచ్చారు.

తమ అద్దె కొంపలో ఉంటున్నంత కాలం, ఒకటో తారీఖు రాగానే, వచ్చే నెలకి ముందుగానే ఇంటి వారికి మొత్తం అద్దె చెల్లించి "హమ్మయ్య! బరువు దిగిం'దని ఊపిరి పీల్చుకునేవారు. కానీ అద్దెకుండేవాళ్లు అలా కూడా ఉంటారని ఆయనకి తట్టలేదు. ఒక పక్క ఈ ధూర్తుడు, మరో పక్క 'మీరు మరీ మెత్తన! వాడికి నోటీసిచ్చి బైటికి తగిలేయమని ఇంట్లో ఎదిగిన పిల్లలు, భార్య పోరు. ఈ ఘర్షణతోనే పదిహేనేళ్లు గడిచిపోయాయి. మధ్యలో, ఆడపిల్లల పెళ్లిళ్ల సమయంలో, ఒక గదైనా ఖాళీ చేసి ఇవ్వమంటే, ఇవ్వలేదా కర్కోటకుడు.

ఈమధ్యకాలంలో, తాసిల్దారుగా రెండు చేతులా సంపాదించాడాయన. ఆ డబ్బు అలానే పడి ఉంటే, ప్రభుత్వం కన్ను దాని మీద పడొచ్చునని, ఊరి చివర పెద్ద స్థలం కొని, బంగళా కట్టించాడు. పంతులుగారి మనసులో చిన్ని ఆశాకిరణం కొంత ఊరట. ఎలాగూ ఇల్లు పూర్తవ్వగానే ఆయనే వెళ్లిపోతాడు గదా! ఈమాత్రం దానికి లాయరు నోటీసులూ, కోర్టు కేసులూ ఎందుకని ఉపేక్షించారు.

ఒకనాటి శుభముహూర్తాన, మేడ మెట్లెక్కుతున్న తాసీల్దారుని, నవ్వుతూ పల్కరించి, "ఇల్లు కడుతున్నారని విన్నాను. చాలా సంతోషం. పిల్లలూ పెద్దవాళ్లవుతున్నారు. అగ్గిపెట్టెలాంటి అద్దె కొంపలో ఎంత కాలం గడుపుకోగలరు?" అన్నారు లెక్కలమాస్టారు. అన్యాపదేశంగా ఇల్లు ఖాళీ చేయండని చెప్పడం అది.

దానికా ధూర్తుడు, ధుమ ధుమలాడుతూ, "ముసలోడా! నువ్వలాంటి ఆశలేమీ పెట్టుకోకు. నీ ఇల్లు వాకన్ని విధాలా అచ్చి వచ్చింది. పుష్కలంగా ఆర్జించాను. అది ధన రూపేణా ఉంటే, ఎవరి కన్నయినా కుట్టవచ్చునని, ముందు జాగ్రత్తగా ఇల్లు కట్టాను. అద్దె కిస్తే, వెయ్యి



రూపాయల దాకా వస్తుంది. అది వదులుకోవడానికి నేనేమైనా వెర్రివాడినా? ఈ ఇల్లు నేను ఖాళీ చేయడం కల్ల. మరిచిపో!" అని సమాధానం చెప్పాడు.


లెక్కల మాస్టారు హతాశులయ్యారు. ఒకవైపు ముసలితనం, మరోవైపు భార్యాపిల్లల భవిష్యత్తేమిటన్న చింత. మనోవ్యాధితో మంచం పట్టారు. పక్షవాతం వచ్చింది. చేయీ కాలూ కదపలేని పరిస్థితిలో ఒకనాడు తాసీల్దారుని పిలిపించి బ్రతిమిలాడుకున్నారు. తన పిల్లలకి అన్యాయం చేయొద్దని వేడుకున్నారు. ఏ కళనున్నాడో, పంతులుగారి అనారోగ్యం చూసి జాలి పడ్డాడో, ఏమైతేనేం, ఓ పాతిక వేలు డబ్బు పుచ్చుకుని ఇల్లు ఖాళీ చేసేందుకు ఒప్పుకున్నాడాయన.

ఆయన ఇల్లు ఖాళీ చేసి వెళ్లిన వాడు మాస్టారి కళ్ల వెంట రక్తమే కన్నీరై కారింది. నాలాంటి అభాగ్యుడిని క్షోభపెట్టావు. ఇంతకింతా అనుభవిస్తావులే అని దుఃఖించారు. ఆ తరువాత ఆయన ఈ లోకం విడిచి వెళ్లిపోయినా, ఆ శాపం మాత్రం పాశమై, తాసీల్దారు వెంట వెళ్లింది.

లంచాలు పట్టి తప్పిన ఇంట్లోకి మారిన మర్నాటి నుంచీ, తాసిల్దారు కష్టాలు మొదలయ్యాయి. "అన్యాయార్జితేవ విత్తం, వ్యాధి రూపేణ పీడితః' అని ఊరికే అన్నారా! అనుభవజ్ఞులు. హోదాకి మించిన ఆస్తి ఎక్కడిదని ప్రభుత్వం ప్రశ్నించింది. ఫలితంగా చేస్తున్న ఉద్యోగం ఊడిపోయింది. ఉన్న డబ్బంతా వెచ్చించి, పెద్దకొడుకుని పై చదువులకి అమెరికా పంపాడు. అతనక్కడ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నకొడుకు చెప్పిన మాట వినకుండా, జాత్యంతర వివాహం చేసుకుని, తల్లిదండ్రులతో తెగతెంపులు చేసుకుని విడిగా పోయాడు. భార్య కేన్సరుతో పోయింది. ఇక మిగిలింది ఆఖరి కూతురు శారద. అది చిన్నప్పటి నుంచీ పీలగా ఉండేది. ఎప్పుడూ ఏదో అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. పెళ్లీడుకొచ్చే సమయానికి ఆమెకు గుండెజబ్బు ఉందని తెలిసింది. తాసీల్దారుగారి నిర్వాకం తెలిసిన వారెవరూ, ఆయనతో సంబంధం కలుపుకోవడానికి ఇష్టపడలేదు. ఆ కారణంగా ఆమెకు పెళ్లి కాలేదు. గుడ్డిలో మెల్లగా అదే మంచిదయింది. మధుమేహం, రక్తపోటుతో కాలూ చెయ్యీ పడిపోయి, మంచం పట్టిన ఆయనకి సేవ చేయడానికి ఈ జబ్బు పిల్లే గతి అయింది. ఎంత సంపాదిస్తే ఏం లాభం? అనుభవించే యోగం లేకపోయాక.

అంత జరిగాక, తాసీల్దారుకి జ్ఞానోదయం కలిగింది. చేసిన తప్పు తెలియ వచ్చింది. వెళ్లి క్షమార్పణలు చెప్పుకుందామంటే లెక్కలమాస్టారీ లోకంలో లేరు. పశ్చాత్తాపాగ్నిలో తప్తుడైన ఆయనకొక ఆలోచన వచ్చింది.

ఒకనాడు కూతురు శారదను పిలిచి, "అమ్మా! లెక్కలమాస్టారింటికి వెళ్లి, వారి అబ్బాయినోసారి రమ్మన్నానని పిలుచుకురా!" అన్నాడు.



అందుకామె "అంత జరిగాక, ఆయన మనింటికి వస్తారా నాన్నా?" అని సందేహం వెలిబుచ్చింది.

"వస్తాడమ్మా! వస్తాడు. అతను లెక్కలమాస్టారబ్బాయి. ఆయన సంస్కారం పుణికిపుచ్చుకున్నవాడు. ఒకసారి నువ్వు పిలుచుకురా!" అని ఆమెను సాగనంపాడాయన.

ఆశించినట్టుగానే రెక్కలు కట్టుకువచ్చి వాలాడతను. "మీ అనారోగ్యం విషయం తెలిసి చాలా బాధపడ్డాను. చెప్పండి. నా వల్ల ఏ సహాయం కావాలన్నా చేస్తాను" అన్నాడు.

"నీ సహాయమే కావాలి నాయనా! నువ్వొక్కడివే చేయగల సహాయం అది" అంటూ దిండు కింది నుంచి, పాతికవేల రూపాయల నోట్ల కట్ట తీసి అతని చేతిలో పెట్టాడు తాసీల్దారు.

"అదేంటి?" అని ఆశ్చర్యపోతున్న వాడికి, వాటి వాటి కథ చెప్పి, "ఈ డబ్బు తీసుకుని నన్ను పాపవిముక్తిడిని చేయి" అని ప్రాధేయపడ్డాడు. చేతులు జోడించి నమస్కారం చేశాడు.

అందుకాయన చాలా నొచ్చుకుంటూ "అయ్యయ్యో! మీరు పెద్దవారు. ఇలా చేయడం తగదు. జరిగిందేదో జరిగిపోయింది. ఇచ్చిన డబ్బు ఇలా తిరిగి పుచ్చుకోవడం భావ్యం కాదు. అప్పుడు మేము బాగానే ఉన్నాము" అన్నాడు.

"మీ కోసం కాదు నాయనా! మీ బాగు కోసం నువ్వు డబ్బుని అంగీకరించక తప్పదు. పోనీ నీకక్కర లేకపోతే ఏదైనా బాంకులో వేసి, దానిమీద వచ్చే ఆదాయంతో మన ఊరి బడిలో, ఒక బీద విద్యార్థికి చదువుకోడానికి సహాయం చెయ్యి. అదీ నా పేరు మీద కాదు. లెక్కలమాస్టారి పేరు మీద. జీవితపు చరమదశలో, అది నా చివరి కోరిక. కాదనకు బాబూ!" ప్రాధేయపడి, ఆ డబ్బు అతని చేతిలో పెట్టాడు.

ఆ మాటలతో తన తండ్రి మళ్లీ బ్రతికి వచ్చినట్టనిపించి, ఆయన అందుకంగీకరించాడు. కొందరు బ్రతికుండీ చచ్చిన వారైతే, మరికొందరు చనిపోయాక కూడా బ్రతికి ఉంటారు.

అద్దెకొంప లాంటి ఈ భౌతికకాయాన్ని ఆత్మ అంటి పెట్టుకుని ఉన్నంత కాలం, అదే శాశ్వతమనిపిస్తుంది. తాసీల్దారు శరీరం నుండి ఆ హంస ఎగిరిపోయే సమయం కోసం ఎదురుచూస్తోంది.

## నటన కొనసాగిస్తా

**తా**రలు పెళ్లి చేసుకున్నాక నటనకు గుడ్‌బై చెప్పడం అనేది ఈమధ్య అంతగా కనిపించడం లేదు. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో కంటిన్యూ అవుతున్నారు. ఆ లిస్టులోకి మీనా కూడా చేరుతోందిప్పుడు. ఈమధ్యనే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని పెళ్లాడిన మీనా కొత్తగా ఓ తమిళ చిత్రంలో నటించడానికి ఒప్పుకుందిట. తన భర్త ప్రోత్సాహంతోనే తను పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో నటిస్తున్నట్టు చెబుతున్న మీనా టీవీ సీరియల్స్ కూడా చేస్తానంటోంది.